# రచయిత బందిఖాన

## ఎమ్.వి.వి. సత్యనారాయణ

"మీ కోసం ఎవరో వచ్చి వెళ్ళారు!" అన్నది సత్య.

నేను జోళ్ళయినా విప్పకుండా, కుర్చీలో కూలబడ్డాను. తిరిగి తిరిగి రావడం వలన అలసటగా వుంది. రచనలు అచ్చుకావడం ఒక ఎత్తు అయితే ఆయా పత్రికలలో వచ్చిన రచనలను సేకరించుకోవడం మరో ఎత్తు. ఎక్కువ పత్రికలు రచనలను గురించి తెలుపకుండా నే అచ్చువేసుకోవడం వలన ఇలాంటి యిబ్బంది నాకు తరచుగా ఎదురౌతోంది.

"ఎవరు వచ్చి వెళ్లారో పేరు చెప్పారా?" అడిగాను మా ఆవిడను.

"పేరు చెప్పలేదు. మరల వస్తామన్నారు. మీ స్నేహితుడి యింటికి వెళ్తే ఆయనే స్వయంగా వచ్చి మన యిల్లు చూపించారు!"

"మనిషి ఎలా వున్నాడు?"

"ఖరీదయిన గ్లాస్కో పంచెమీద సూరత్ సిల్కు

చొక్కా వేసుకున్నారు. భుజాన ఖరీదయిన కండువా వేసుకున్నాడు. రెండు చేతులకు మూడేసి చొప్పున రాళ్ల ఉంగరాలు, కన్వాస్ తోలు చెప్పులు. మారానికే ఖరీదయిన సెంటు వాసన!"

"నేను మనిషిని గురించి వర్ణించమంటే నువ్వు అతడి వేషం విషయం చెప్పావు!"

సత్య నవ్వింది. "ఆరడుగుల ఎత్తూ, ఎర్రటి ఛాయా! తేనెరంగు కళ్ళూ. కళ్ళలో ఎర్రటి జీరలూ..."

నా మెదడు ఆలోచిస్తోంది. సత్య వర్ణించిన వ్యక్తి బడా కాపిటలిస్టు అయివుండాలి. అటువంటి వ్యక్తి ఎవరూ నాకు తెలిసిన వాళ్ళలో లేరు. ఆ వ్యక్తికి నాతో పని ఏమిటి? విచిత్రం!

బట్టలు మార్చుకుని వ్రాతకి కూర్చున్నానన్నమాటే కాని నా కలం కదలనని మొరాయిస్తోంది. లేచివెళ్ళి మా యింటి తోటలో పచార్లు చేయసాగాను. తోటలోంచి వీధి కనిపిస్తోంది. ఒక కుర్రవాడు మా యింటివైపు వచ్చాడు.

"ఎమ్. వి. వి. .... గారిల్లు ఇదేనాండీ?" అడిగాడు ఆ కుర్రవాడు.

నేను తలూపాను.

ఆ కుర్రవాడు చటుక్కున తోటకి వున్న కంచెకు దగ్గరగా వచ్చి చెయ్యి చాపాడు. అతడి చేతిలో రోజా రంగు కవర్ వుంది.

"డిటెక్టివ్ శిరీష్‌గారు అట! ఆ రోడ్డుమీద కారు ఆపి నన్ను పిలిచి మీకు యివ్వమని అడ్రసు చెప్పి కారులో వెళ్ళిపోయారు" అన్నాడు ఆ కుర్రవాడు.

నేను కవరు అందుకున్నాను.

"కారా? పోలీసు జీపా?" అడిగాను.

"అవునండి. పోలీసులు వెళ్ళే కారు. అంబాసిడర్ కారు. నీలం రంగు! పైన పోలీస్ అని యింగ్లీషులో రాసివుంటుంది."

"వెరీగుడ్. శిరీష్ గారి ప్రక్కన ఎవరయినా కూర్చుండి వున్నారా?"

"వున్నారండి. పోలీస్ ఇన్స్పెక్టర్ గారు కాబోలు!"

గేటు తెరుచుకుని అవతలకు వెళ్ళి ఆ కుర్రవాడిని భుజం తట్టి పంపేశాను. తిరిగి ఇంట్లోకి వచ్చి కవర్ తెరిచి చూశాను. తెల్ల కాగితం వుంది. తీసి చదివాను.

"డియర్ సత్యనారాయణా!

అత్యవసరంగా, ఈ దారిన వెళ్తో కూడా మీ యింటికి రాలేకపోయాను. మేనకాలో పదో నెంబర్ రూంలో వుంటాను. ఇన్స్పెక్టర్ కుమార్ నాతోబాటు ఈ రోజంతా వుంటాడు. క్రైం బ్రాంచ్ కేసులు చెబుతాడు. రా! నీకు కావలసినంత మేటర్!"

—శిరీష్."

చదవడం అయ్యాక నవ్వుకున్నాను. వాళ్ళిద్దరి అనుభవాలూ నాకు క్రైం సాహిత్య రచనలో తోడ్పడుతున్నాయి. శిరీష్‌ని కలుసుకోవాలి. మేనకా హోటలుకి వెళ్ళాలి.

గుమ్మం వద్ద చప్పుడయింది. మా ఆవిడ లోపలికి వచ్చింది....

"ఆయన వస్తున్నానండి! కాఫీలు కలాపాలా?" అడిగింది సత్య.

"ఆ, కలుపు!" అంటూ సమాధానం కోసం ఎదురు చూడకుండానే డ్రాయింగ్ రూంలోకి నడిచాను. ఆయన అప్పటికే గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు. సెంటు వాసన లోపలికి వస్తోంది. నిండైన ఆయన విగ్రహం మా యింటి గుమ్మానికే నిండు తెచ్చింది.

"లోపలకు రండి సార్!" అన్నాను గుమ్మం దగ్గర నిలబడి.

ఆయన నావంక చూచి నవ్వాడు. పెదిమలు నవ్వుతున్నాయి కాని కళ్ళలో ఎరుపు రంగు చారలు మెదలుతూండటం వలన కాబోలు ఆయన నవ్వు హృద్యంగా లేదు. ఆయన తలూపి లోపలకు వచ్చాడు. సోఫాల్లో కూర్చున్నాం యిద్దరమూ.

"నన్ను శంకరరాజన్ అంటారు!" అన్నాడు ఆయన.

నా మెదడు కొన్ని క్షణాలపాటు కడిగివేసినట్లు తెల్లగా అయిపోయింది. శంకరరాజన్ అంటే దక్షిణ భారత చిత్రసీమలో పేరొందిన డిస్ట్రిబ్యూటర్. శంకర్ రిలీజ్ కంపెనీతోబాటు ఆయనకి నాలుగైదు డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీలున్నట్లు నాకు తెలుసు. ఆ శంకర్ రాజన్ మా ఇంటికి వచ్చాడా? ఇప్పుడు నా ఎదురుగా వున్న శంకర్ రాజన్ ఆయనేనా?

ఆలోచనల దాడిని తట్టుకోలేక తల విదిలించాను.

"మీరు.... మీరు...." తడబడ్డాను.

ఆయన సోఫాలో వెనక్కి జారగిలబడి కాలుమీద కాలు వేసుకూర్చున్నాడు. జేబులోంచి బంగారపు సిగరెట్ కేసు తీశాడు. కేసు తెరచి నాకు ఆఫర్ చేశాడు. సిగరెట్స్ అలవాటు చేసుకోలేకపోయినందుకు

నాకా క్షణంలో చిన్నతనంగా తోచింది.

"నో సర్ .... కాల్చను!" నోరు పెగిలింది.

ఆయన సిగరెట్ ముట్టించుకుని, గుండెలనిండా పొగ పీల్చుకున్నాడు.

"వింతగా వుంది. ఫీల్డులో రచయితలు కాగితాలను వూదరు. సిగరెట్లనే!" అన్నాడు ఆయన పొగ వదులుతూ.

పొగ తాలూకు సువాసన సోఫాలచుట్టూ అలుముకుంది.

ఈయన డిస్ట్రిబ్యూటర్ శంకర్ రాజన్ గారే! అయినా నాకు మనసు సమాధానపడటంలేదు. ముక్కూ మొహం తెలియని నాతో ఈయనకి పనేమిటి?

"మీరు మరీ అంత సేపు నా గురించి తర్జన భర్జనలు పడనక్కరలేదు. నాకు మీతో ఒక చిత్రానికి కథ రాయించుకోవాలనిపించింది!"

ఆయన మాటలు నాకు బుర్రలో ప్రవేశించి స్పృహ తప్పేలాగా చేయబోయాయి. అదృష్టవశాత్తు మా ఆవిడ ట్రేతో కాఫీలు తెచ్చి పెట్టింది. నేను నిలద్రొక్కుకున్నాను. కాఫీలు సర్వ్ చేసి మా ఆవిడ వెళ్ళిపోయింది. ఇద్దరం కాఫీలు త్రాగాం.

"నాతోనా! చిత్రానికి కథ రాయించడమా?" అడగగలిగాను చివరకు.

"అవును. మీ విశాఖపట్నం పరిసరాల్లోనే ఆ పిక్చర్ ను నెలరోజులపాటు షూట్ చేసెయ్యాలని మా పథకం! అందుకే ఇంత హడావుడిగా బయలుదేరి మీ వద్దకు వచ్చాను."

"నెల రోజులే! ఇంత తక్కువ కాలంలోనా?"

"అవును. పై నెల పదిహేనో తారీఖుకల్లా షూటింగ్

ముగియకపోతే నాకు కొన్ని రకాల ఇబ్బందులు ఎదురౌతాయి."

"షూటింగ్ ఎప్పటినించీ షెడ్యూలు చేశారు?"

"మీరు కొన్ని సీనులను ముందు ఇచ్చెయ్యండి. వాటికి లొకేషన్స్ ఎన్నుకోవాలి."

"తారలూ, వాళ్ళ కాల్‌షీట్సూ...."

ఆయుని పెళ్ళున నవ్వాడు. "నా పిక్చర్‌లో నటించడమే గొప్ప....కాల్ షీట్స్ నేను ఫిక్స్ చేయవలసిన తారలు నాకున్నారు."

నాకు ఆయనపట్ల గౌరవం కలిగింపయింది. జగత్తుకు మూలం ధనమే—

"ఏం పిక్చర్ తీయాలనుకుంటున్నారు? జానపదమా?" నేను చాలా కాలంనుండి పిల్లల రచయితను.

"కాదు క్రైం చిత్రం!"

"క్రైం చిత్రమా! నేను ఈ మధ్యనే మొదలు పెట్టాను క్రైం సాహిత్యం రాయడం. నాకంటె చేయి తిరిగిన వాళ్ళ రచనలు...."

"సత్యంగారూ .... నేను ఇలా షార్ట్ కట్‌తోనే పిలుస్తాను. మీరు రెండు రోజుల్లో మాకు ఒక కథ ఇవ్వండి. డైలాగ్స్ రాయించి ట్రీట్ మెంట్ ఇప్పిస్తాను. స్క్రీన్ ప్లే చదివితే మీరే దంగయిపోతారు."

నేను అయోమయంలోంచి ఇంకా తేరుకోలేదు.

"కథకి అయిదువేలు యిస్తాను."

ఓ హెన్రీ కథల్లో కొసమెరుపులలాగా నా మస్తిష్కం మీద ఆయన మాటలు ఒక్కొక్కటి ఒక్కో హ్యామర్ దెబ్బలాగా తగులుతున్నాయి.

"ఏమండీ మాట!" తలుపు వెనకనుండి కోకిల కంఠం

వినిపించింది. అవతల పెద్దమనిషి మాట్లాడుతోన్నా, డబ్బు ప్రసక్తి వచ్చినా ఆడవాళ్ళ కంఠాలు మాధుర్యాన్ని అద్దుకుంటాయి. నేను లేచి ఆయినకి క్షమాపణ చెప్పుకుని లోపలకు వెళ్ళాను.

"సినిమా కథకి బోడి అయిదు వేలు ఏమిటండీ? పదివేలు అడగండి!" గదిమింది మా ఆవిడ.

నేను బిత్తరపోయాను.

నాబోంటి రచయితకి సినిమా ఛాన్స్ రావడమే గొప్ప! బేరం పెడితే ఏం బావుంటుంది?

"మనం రేటు పెంచితే ఆయన మరొకళ్ళకి ఇచ్చుకుంటాడేమో—"

"ఏమీ యివ్వడు. లక్షలు పెట్టి తీసే సినిమాకి కథా రచయితకి కేవలం ముష్టి అయిగువేలేనా?"

"వెర్రి మొహమా! యాభై తెలుగు కథలు రాసినా అయిదువేలు రావే!"

"మీ మొహం! తెలుగు కథకీ— తెలుగు సినిమాకీ లంకె ఏమిటి? పత్రికలు కొనేవాళ్ళెందరు? సినిమాలు అందరూ చూస్తారు."

"ముందు నేను రెండు రోజులలో కథ రాయాలి గదా!"

"ఏం? ఎందుకు రాయలేరు! రాయటం కొత్తా?"

"రాసింది ఆయనకి నచ్చాలిగదా!"

"నచ్చేదేమిటి నా మొహం? ట్రీట్ మెంటు వాళ్ళే యిచ్చుకుంటారు!"

"ట్రీట్ మెంటు అంటే కళాయి పూత అనుకున్నావా?"

"ఏదో గోల.... ముందు పదివేల రూపాయలకు

ఖాయం చేసుకోనండి. అంతకీ మీరు రాయలేకపోతే అప్పుడు చూద్దాం"

"నవు రాస్తావా ఏమిటి కొంపతీసి?"

"నేను రాయగలిగితే ఇంత రభస దేనికి? ఆయన్ని అక్కడే కూర్చోబెట్టి రాసి యిచ్చేదాన్ని! అంతకీ మీరు యిప్పుడు రాసియిచ్చే కథ ఆయనకి నచ్చకపోతే.... మన "నల్లకారు" నవలిక యివ్వండి. నచ్చితీరుతుంది."

"అసలు 'నల్లకారు' నవలిక చదివే ఆయన మన దగ్గరకు వచ్చివుంటాడులే....ఆ నవలిక కావలిస్తే దాన్నే కొనుక్కునేవాడు కదా!"

"హుఁష్! అవతల పెద్దమనిషి కూర్చుండివుంటే ఈ వితండవాదం ఏమిటి?" అన్నది సత్య, తప్పంతా నాదే నన్నట్టు.

స్త్రీ జాతి సహజగుణం తప్పును నెట్టడం అనుకున్నాను.

"పదివేల మీదే వుండండి!" అంటోంది మా ఆవిడ.

నేను డ్రాయింగ్ రూంలోకొచ్చి శంకరరాజన్ గారి ఎదుట కూర్చున్నాను. ఆయన చూపులు నన్ను ఎక్స్‌రే తీస్తున్నట్టు ఫీలయ్యాను. ఇబ్బందిగా కదిలాను.

"అరిక విషయాలలో ఆడవాళ్ళ ఐక్యంచేసుకున్నట్టున్నారు!" ఆయన నవ్వాడు. ఈ మాట కూడా మా ఆవిడకు వినపడే వుంటుంది.

"అబ్బే...." తేలు కుట్టినట్టు చూశాను.

"ఫరవాలేదులెండి....ఎంత కావాలి కథకు?"

"ప....ప్పదివేలు!"

అయన బోళాగా నవ్వి "పదివేలకు మాకు ఎన్ని క్రైం నవలలు కావాలి?" అన్నాడు.

ఆడదాని మాట వింటే బేరం చెడిపోదా.... నిట్టూర్చాను. కాళ్ళ దగ్గరకు వచ్చిన బేరం! ఈయనను సవరించుకోవడం ఎలా? ఆయనవైపే చూస్తూ ఆలోచనలో పడ్డాను.

"ఆల్ రైట్! పదివేలు యిస్తాను" అన్నాడు ఆయన.

నా గుండె తెగి తిరిగి అతుక్కున్నట్టయింది. ఎలాగయినా మా ఆవిడ గట్టిదే! శంకర్ రాజన్ కడుపులోని వ్యూహాను పసిగట్టకలిగింది!

"అయితే ఆ చిత్రం తమిళంలో, కన్నడంలో, మళయాళంలో ఒకేసారి తీస్తాను. హక్కులు నావే!"

నా మనసు పొంగిపోయింది. నా కథ అన్ని భాషల లోకి వెళ్ళోంది.

అంగీకారంగా తలాడించాను. శంకరరాజన్ తలుపు వైపు చూశాడు. రెస్పాన్స్ రాలేదు. నన్ను చూచి నవ్వాడు. నేను వెర్రి నవ్వు నవ్వాను.

పదివేలు వినిపించిన చెవులకు పరభాషల గురించిన వివరాలు వినిపించి వుండవు అని సరిపెట్టుకున్నాను.

"మీరు బయటకు వస్తారా సత్యంగారూ!" అడిగాడు శంకర్ రాజన్.

"వస్తానండి. ఎంతవరకూ వెళ్ళాలి మనం?" అన్నాను.

శంకర్ రాజన్ కొత్త సిగరెట్టు తీసి ముట్టించాడు. "భీమునిపట్నం వెళ్ళే రోడ్డుమీద ప్రయాణించారా?" అన్నాడు.

"లేదు. ఎప్పటికప్పుడే బీచ్ ఒడ్డునే వేసిన రోడ్డు మీద ప్రయాణం చేయాలనుకుంటూనే వాయిదా వేస్తున్నాను."

"ఇప్పుడు రండి... నా కారులో వెళ్దాం."

"ఎందుకు?"

"బీచ్ రోడ్‌లో గంభీర గడ్డ వుంది. ఆ గడ్డకి మైలు దూరంలో తుప్పలమధ్య పాడుబడిన భవంతి ఒకటి వుందట. అచ్చంగా అది భూత్ బంగ్లా. ఆ లొకేషన్స్ చూస్తే మీకు కొత్త ఆయిడియాలు రావచ్చును.

ఆ భవంతిలో హీరోయిన్‌ని బంధిస్తారు. డిటెక్టివ్ సినిమా చివరలో ఆమెను హంతకుల ముఠాతో వీరోచితంగా పోరాడి రక్షించి తన దాన్ని చేసుకుంటాడు. మీరు కథను ఆ రకంగా మలుచుకోవాలి!"

నన్ను అనవసరంగా కథలు రాసి యివ్వమని కోరుతున్నాడు కాని, శంకర్‌రాజన్ పొట్టలోనే పుట్టెడు కథలున్నాయి!

ఇంట్లో చెప్పి ఆయన వెంట బయలుదేరాను. మా యింటికి వున్న సందు దాటగానే రోడ్డుమీద ఎర్రటి చెవర్లెట్ కారు కనిపించింది. ఇద్దరమూ కారు సమీపించాం. కారులో ఎవరో కూర్చుండి వున్నారు. అతడు చటుక్కున డోర్ తెరిచి పట్టుకున్నాడు. అతడు డ్రైవింగ్ సీటు ముందునుండి వంగాడు.

ఇద్దరము వెనక సీట్లో కూర్చున్నాము. డ్రైవింగ్ సీట్లో కూర్చున్న వ్యక్తి కారును స్టార్టుచేశాడు.

చెవర్లెట్ కారు హైవేమీద దూకింది. యింజనీరింగ్ హాస్టల్స్ రోడ్డులో ప్రవేశించి మలుపు తిరిగి పెద వాల్తేరు రోడ్డు పట్టింది.

"అతడు మా బావమరది. పరాంకుశం!" అన్నాడు శంకర్ రాజన్.

అలాగా అన్నట్టు చూచి డ్రైవింగ్ సీట్లోని వ్యక్తికి నమస్కార బాణం విసిరాను. అతను తలాడించి, "నమ

స్కారం!" అన్నాడు. పరాంకుశం గొంతు పేలుసుగా వుంది. లోహం రేకుమీద గీతగీచినట్టుగా వుంది.

"మావాడు కూడా కథలు రాస్తాడు. మద్రాసులోని పరాంకుశం పబ్లికేషన్ మావాడిదే!" అన్నాడు శంకర్ రాజన్.

"చాల సంతోషం సార్!" అన్నాను ఆనందంగా. పనిలో పనిగా పబ్లిషర్ కూడా పరిచయమవుతున్నాడు. నా రచనులను తన పబ్లికేషన్‌లో తీసుకువస్తాడేమో చూడాలి.

"సత్యనారాయణగారూ! మీరు నాకు నెలలో నవల చొప్పున అందించగలరా?" అడిగాడు పరాంకుశం.

"ప్రాయత్నిస్తాను!"

కారు బీచ్‌రోడ్డు మీద పరుగెత్తుతోంది. దారినపోయే జనం చాలమంది ఎర్రటికారును ఆశ్చర్యంగా చూస్తోన్నట్టు నాకు వాళ్ళ చూపులు చెబుతున్నాయి.

శంకరరాజన్ మెల్లగా దగ్గాడు. "చూడండి సత్యం గారూ! మీరు రాయబోయే కథలో మన కారెక్టర్ యాక్టర్స్‌లో ఇద్దరికి అవకాశముండాలి. కమిడియన్ వుండాలి. డిటెక్టివ్‌కి అసిస్టెంటుగాగానీ, విలన్‌వద్ద వుండేటట్టుగాగానీ సృష్టించాలి. డిటెక్టివే హీరో.... అతడికి హీరోయిన్‌తో నాలుగయిదు పాటలు రాసి సిద్ధంగా వున్నాయి."

"కథకీ పాటలలోని సాహిత్యానికీ అతుకుతుందా?"

"సాహిత్యమా?" ఫెళ్ళున నవ్వాడు శంకర్‌రాజన్. "తెరమీద సాహిత్యం ప్రదర్శిస్తామా? రెండు కాబరే డాన్సులను చూపిస్తానంటున్నాడు డైరెక్టర్. హోటలు సెట్టు వేయిస్తున్నాడు."

"నాకు అయోమయంగా వుంది సార్ .... ఇంకా కథా కారకాయా లేరు. అప్పుడే పాటలూ, సెట్టింగులూ .... నటులూ ...."

నా అమాయకత్వానికి జాలి పడినట్టుగా చూచి నవ్వాడు శంకర్ రాజన్. పరాంకుశం శృతికలిపాడు. బీచ్ గాలి నాకు కితకితలు పెడుతోంది.

"సినిమా అంటే అతుకుల బొంత! ఏ విభాగానికి ఆ విభాగం అతుక్కు రావడమే.... ఆ విషయాలు చూసుకోవడానికి వేరే మనుషులూ వాళ్ళ విభాగాలూ వున్నాయి. రచయిత పని కథను సమకూర్చడం వొక్కటే!"

"పరాంకుశంగారివంటి రచయితను ప్రక్కన పెట్టుకుని నాకోసం వెతుక్కు రావడం నాకు ఆశ్చర్యంగా వుంది."

నా మాటలకు పరాంకుశం నవ్వాడు. శంకరరాజన్ అతడిని సీరియస్‌గా చూశాడు. "మావాడి సంగతి నాకు తెలుసు! అంటాడు మా బావ. ఏమయినప్పటికీ పెరటి మొక్క మందుకు పనికిరాదు సుమండీ!" అన్నాడు పరాంకుశం.

శంకర్ రాజన్ మెల్లగా నవ్వి, "నేను పదిసంవత్సరాలకు పైగా సాహిత్యం గురించి ఆలోచిస్తున్నాను. నా నిర్ణయాలు నావి!" అన్నాడు.

నేను దూరంగా పరచుకున్న సముద్రం వైపూ, దిగంత రేఖవైపూ చూచి ఆనందపడుతున్నాను. ఈ ప్రకృతిని చూచి చాలకాలమయింది. చల్లటి గాలితో మనసు సేద దీరుతోంది.

"పరాంకుశం! కారును ఆ ప్రక్క మట్టిరోడ్ కి మళ్ళించు. అక్కడే ఆపి నడిచి వెళ్ళాలి మనం" అన్నాడు శంకర్ రాజన్.

ఇటు వైపు కొండలమధ్య లోయ. లోయ పచ్చగా చెట్లతో, పొదలతో అల్లిబిల్లిగా అల్లుకుపోయి వుంది.

మట్టి రోడ్డుమీద కారు ఆగింది. డోర్ తెరిచి పరాంకుశం కారు దిగాడు. నేనూ, శంకర్ రాజన్ చెరొక వైపూ కారు దిగాం. చుట్టూ నిశ్శబ్ద ప్రకృతి! ఎక్కడి నుండో పక్షి అరుస్తోంది. అంతే!

మట్టిరోడ్డు లతలతో మూసుకుపోయి కాలిబాట చిక్కిపోయి వుంది. ముగ్గురమూ కాలిబాట పట్టుకున్నాం.

"వైజాగ్ లో పిక్చర్ తీస్తే మీకు నిర్మాణం ఖర్చులు ఎక్కువవుతాయేమో!" అడిగాను.

నిర్మాణం ఖర్చుల గురించి శంకర్ రాజన్ చెప్పుకు పోతున్నాడు.

## 2

చెవర్లెట్ కారు తిన్నగా మేనకా హోటలు ఆవరణలో ప్రవేశించింది. పార్కింగ్ ప్లేస్ లో హుందాగా ఆగింది.

నేను చప్పున కారు దిగి హోటలులోకి నడిచాను. పరాంకుశం, శంకర్ రాజన్ కారులోనే కూర్చున్నారు.

పద్నాలుగో నెంబర్ రూం ముందు ఆగాను. పిడితిప్పాను. తాళం పెట్టి వుంది. గోడమీద వున్న స్విచ్ బోర్డులో చిన్న అట్టముక్క పెట్టివుంది. చటుక్కున దాన్ని అందుకుని చూశాను.

"డియర్ సత్యనారాయణా,

రాత్రికి రూంలోనే వుంటాను. సారీ ఫర్ మిస్సింగ్ —

శిరీష్."

అని వుంది.

నిట్టూర్చాను. కార్డును యథాస్థానంలో నే వుంచి నేను తిరిగి కారు వద్దకు వచ్చాను.

"మా ఫ్రెండు లేడు" అని చెప్పి కారు ఎక్కి కూర్చున్నాను.

కారు నన్ను మా యింటివద్ద రోడ్డు మీద డ్రాప్ చేసి వెళ్ళిపోయింది.

నేను మెల్లగా నడుచుకుంటూ ఇంటికి వచ్చాను. డ్రాయింగ్ రూంలో కూలబడ్డాను. మెల్లగా బట్టలు మార్చుకుని భోజనం చేశాను. కొంతసేపు పాటు నడుం వాల్చుదాం అనుకుంటూండగానే గుమ్మం దగ్గర చప్పుడయింది. చటుక్కున లేచి బయటకు వెళ్ళబోయి ఆగాను. అప్పటికే మా ఆవిడ తలుపు తీసింది. మా యిద్దరు పిల్లలూ బిలబిలాడుతూ స్కూలునుండి కాబోలు పరుగెత్తుకు వచ్చారు.

"ఏమండోయ్....ఇటురండి...." పిలిచింది మా ఆవిడ.

నేను బదకంగా ఆవులించి గుమ్మంవైపు నడిచాను. నా బదకం దిగిపోయింది. డ్రాయింగ్ రూంలో ఒక మెరుపుతీగె సోఫాలో కూర్చుని వుంది. ఆమె నన్ను చూడగానే లేచి నిలబడి చేతులు జోడించింది.

నేను ఆమెకు ప్రతి నమస్కారం చేసి సోఫాలో కూర్చుండమని సైగచేసి నేనూ ఎదుటి సోఫాలో కూలబడ్డాను.

"నా పేరు వనజ" ఆమె గొంతులో కోయిల తిష్ట వేసినట్టుంది.

"సంతోషం. అందమైన పేరు" అన్నాను. ఆమె అప్పాయమ్మ అయినప్పటికీ ఆ పేరుకే అందం మరి!

"మీ క్రయిం కథలు నాకు బాగా నచ్చుతాయండి!

ఒకరకంగా నేను మీ కథలంటే పడిచస్తాను!" ఆమె చక్రాల్లాంటి కళ్ళు నల్లగా మిలమిలలాడాయి.

"క్రయిం కథలను సమర్థవంతంగా రాస్తే ఎవరి కథలయినా అందరికీ నచ్చుతాయి. అయ్‌మీన్ ఆ సాహిత్యం నచ్చేవారికి!"

"క్రయిం సాహిత్యం చదివాక మిగతా సాహిత్య ప్రక్రియలు చప్పగా తోస్తాయి. ఏమంటారు?"

నేను ఏమంటాను? అపరాధ పరిశోధన సాహిత్యం ఇలాంటి మెరుపు తీగకు నచ్చి చరితార్థమయింది?

"ఆమె మీ శ్రీమతిగారా?" అడిగింది వనజ.

నేను తల త్రిప్పి గుమ్మంలో నిలబడిన మా ఆవిడను చూశాను. నవ్వబోయి ఆగాను. మా ఆవిడ కళ్ళు ఎర్రగా వున్నాయి. వాటి ఎరుపుదనం నాకే తెలుసు! ఆమె కోపంగా నావైపు చూస్తోంది.

దీపం వెలిగింది. వనజ పల్చటి పమిట వేసుకుంది. ఎర్రటి ఆమె శరీరచ్ఛాయనూ, యవ్వనం హొయలనూ ఆమె దుస్తులు దాచడంలేదు. ఎర్రటి లిప్‌స్టిక్ వేసుకోవడంవలన కాబోలు ఆమె పెదిమలు దొండపండ్లలాగా మెరుస్తున్నాయి. ఒక చేతికి నల్లటి బెల్టున్న రిస్ట్‌వాచీ, రెండో చేతికి రెండు బంగారు గాజులూ, మెడలో ఒంటిపూస ముత్యాలహారం....

నేను చటుక్కున చూపు మరల్చుకున్నాను. ఇబ్బందిగా కదిలాను.

వనజ కొద్దిసేపు అవీ ఇవీ మాట్లాడి, లేచింది. "నన్ను హైవేమీద వరకూ దిగబెట్టండి. వెళ్ళిపోతాను. ఇంట్లో మావాళ్ళు నాకోసం ఎదురుచూస్తూ వుంటారు" అన్నది.

నేను బతుకుజీవుడా! అనుకుంటూ లేచి లోపలికి

నడిచి బట్టలు వేసుకున్నాను.

మా ఆవిడ నా వంక కోరగా చూచి వంటయింట్లోకి వెళ్ళింది.

వనజా నేనూ యింట్లోంచి బయటకు నడిచాం. వీధిన వెళ్ళేవాళ్ళు వనజను ఒకటికి పదిసార్లు చూస్తున్నారు. ఆమె చీరకట్టు సినీతారల తలదన్నినట్టు కట్టింది మరి!

ఇద్దరం హైవేమీదకు వచ్చాం.

"సత్యనారాయణగారూ! కాస్త కాఫీత్రాగి వెళ్దాం" అంది వనజ.

ఆమెకు కాఫీ యివ్వలేని సమయంలో వనజ మా యింటికి వచ్చింది. ఆమె తనంత తాను అడిగినప్పుడు తప్పదు. ఇద్దరమూ హోటలువైపు నడిచాం. చిన్న హోటలు అది! హోటలు ఖాళీగా వుంది. ఇద్దరమూ ఒక టేబులువద్ద కూర్చున్నాం. సర్వర్‌ని రానిచ్చి ఒక ప్లేటు పకోడీ. రెండు కాఫీ ఆర్డరిచ్చాను.

సర్వర్ పకోడీ తెచ్చాడు. వనజ తింటోంది.

"అరరె! వక్కపొడి వుందా మీ దగ్గర?" అడిగింది వనజ.

"లేదు. మీకు వక్క అలవాటుందా?"

"అవునండి. కాఫీ త్రాగగానే వక్క నమలాలి" అంది వనజ, లేవబోతూ....

"అక్కరలేదు. నేను వెళ్ళివస్తాను. మీరు తింటూండండి!" నేను బయటికి వెళ్ళి వక్కపొడి కొని తెచ్చాను. వచ్చేసరికి టేబులు మీద రెండు కప్పులు సాసర్లు మూసివున్నాయి.

"కాఫీలు వచ్చాయి రండి!" అంది వనజ. ఆమె కళ్ళు వింతగా మెరుస్తున్నాయి. నేను నా కుర్చీలో

చారగిలబడి కాఫీ సిప్ చేశాను. ఆమె తన చేతిలోని గ్లాసును ఖాళీచేసి బల్లమీద పెట్టింది. ఆమె వెనుక నే నేనూ గ్లాసును పెట్టి వక్క పొడి అందించాను. నా చెయ్యి వణుకుతోంది. వళ్ళంతా వూగుతోంది. తల తిరుగుతోంది. నరాలు సాగుతున్నట్టూ, నా ఒంట్లో ఎవరో సుత్తులతో కొడుతోన్నట్టూ శరీరమంతా నొప్పులు.

తలను బల్లమీద వాల్చాను. నేలమీద వక్క పొడి పడిపోయి వుంది. చేతినిచాపి అందుకోబోయాను. అంతే! నా చెక్కిలి బల్లను తాకుతోంది. చెయ్యి అలాగే వుంచాను. కళ్ళు మూతలు పడిపోయాయి.

## 3

డిటెక్టివ్ శరీఫ్ బద్ధకంగా లేచాడు. బెడ్ దిగాడు. ఒళ్ళు విరుచుకున్నాడు. వాచీ చూసుకున్నాడు. సాయంకాలం మూడు దాటుతోంది. నుదురు చిట్లించాడు.

సత్యనారాయణ పదకొండు గంటలకు తాను లేకుండా చూచి ఈ హోటలుగదికి వచ్చాడు. తాను స్విచ్ బోర్డులో పెట్టిన కార్డు చూచి వెళ్ళిపోయి వుంటాడు. అతడు వచ్చి వెళ్ళినట్టు కౌంటర్ లోని మేనేజర్ చెప్పాడు. తాను ఒంటిగంటకి అతడి యింటికి వెళ్ళాడు. అప్పుడే అతడు ఎవరో అమ్మాయితో బయిటికి వెళ్ళాడట. వెళ్ళి గంట అయినా రాలేదని అతడి భార్య చెప్పింది.

ఇంతసేపు ఎక్కడికి వెళ్ళివుంటాడు? ఎక్కడా గంటలతరబడి గడిపే సమయం ఉత్సాహం అతడికిలేవు. అయితే ఆ అమ్మాయితోనే ఎక్కడికో వెళ్ళాడా? అసలు ఆ అమ్మాయి ఎవరు? ఆమెను ఇంతవరకూ ఎక్కడా చూడనట్టు సత్యనారాయణ వాళ్ళ యింట్లో తెలిసింది. ఇక్కడికి రాకపోతే మానె ఇంకా ఇంటికయినా చేరు

కున్నాడో లేదో—

డిటెక్టివ్ శిరీష్ చకచక తయారై హోటలు గదిలోంచి బయటపడ్డాడు. టాక్సీ మాట్లాడుకుని హైవే మీద దిగాడు. చకచక సందులోంచి నడిచివచ్చి సత్యనారాయణ ఇంటిముందు ఆగాడు.

సత్యవతి గుమ్మంలోనే దిగులుగా నిలబడి చూస్తోంది. సత్యనారాయణ ఇంకా రానట్టు ఆమె మొహంలో ఆవేదన స్పష్టంగా వ్యక్తమవుతోంది. శిరీష్ నోట్ బుక్ తీసి, "సత్యనారాయణగారు వెంట తీసుకువెళ్ళిన స్త్రీ పోలికలు చెప్పమ్మా! అతడిని వెతికి పట్టుకుంటాను!" అన్నాడు.

"ఆయనకి ఏమయిందంటారు?" ఆమె గొంతు వణికింది.

"ఏమీ అయ్యుండదు. ఆయన క్షేమంగా తిరిగి వస్తాడు."

ఆమె ధైర్యం తెచ్చుకున్నది. వనజను వర్ణించింది. శిరీష్ నోట్ చేసుకుని ఆమెవద్ద సెలవుపుచ్చుకుని వెనక్కి తిరిగాడు. దారిపొడుగునా ప్రతి యింట్లోనూ అడుగుతూ హైవేమీదకు వచ్చాడు.

అక్కడినుండి బస్ స్టాప్ ఫర్లాంగు దూరం వుంటుంది. వనజను సిటీబస్సు ఎక్కించి వుంటాడా? ఆమెకు ఇంట్లో సత్యవతి అతిథిసత్కారం చేయలేదట. వనజ కట్టూ బొట్టూ ఏమంత గౌరవప్రదంగా లేవట!

సత్యనారాయణ ఆమెను ఏ పాన్ షాపుకో తీసుకెళ్ళి డ్రింక్స్ ఆఫర్ చేసి వుంటాడు. పురుష మనస్తత్వం బలహీనమైనది.

శిరీష్ తలపంకించి పాన్ షాపువైపు నడిచాడు.

"ఆ అమ్మాయితో వచ్చినతనాండి? కాఫీ హోటలుకి వెళ్ళారు. ఈ ప్రక్క హోటలే! చాల సేపయింది. 12 గంటలతర్వాత అనుకుంటాను. ఆ తర్వాత ఇద్దరూ ఆటో ఎక్కి కాబోలు వెళ్ళారు" అన్నాడు పాన్ షాపతను.

శిరీష్ అతడికి థాంక్స్ చెప్పి హోటలువైపు నడిచాడు. చిన్న సైజు హోటలది.

"అతడు వక్కపొడి తీసుకురావడానికి వెళ్ళివచ్చి కాఫీ త్రాగాడు సార్! తరువాత బల్లమీద తల పెట్టి పడుకున్నాడు. ఆమె దారినపోయే ఆటోను పిలిచి అతడిని నడిపించుకుంటూ ఆటో ఎక్కించి తీసుకువెళ్ళి పోయింది సార్!" అన్నాడు సర్వర్.

శిరీష్ నుదురు చిట్లించాడు. సత్యనారాయణకి వక్క పొడి అలవాటు లేదు.

"వాళ్ళిద్దరూ కూర్చున్న సీట్లు చూపిస్తావా?" అడిగాడు శిరీష్.

సర్వర్ అతడికి మూలగా వున్న రెండు కుర్చీలూ బల్లా చూపించాడు. శిరీష్ వాటిని పరీక్షగా చూచి, నేలమీదకు చూశాడు. నేలమీద అయిదుపైసల వక్కపొడి పొట్లం పడివుంది.

వనజ తనకి వక్కపొడి కావాలని సత్యనారాయణను బయటికి పంపివుంటుంది. ఎందుకు? కాఫీ త్రాగి స్పృహ తప్పి పడిపోవడానికి సత్యనారాయణ శరీరారోగ్యంలో ఆ మార్పు ఎలా వచ్చింది? వనజ అతడి కాఫీలో ఏదో కలిపివుండాలి.

'మై గుడ్ నెస్!' తల విదిలించాడు డిటెక్టివ్ శిరీష్. వక్కపొడికి కొంతదూరంలో చిన్న కాగితం మడత

వుంది. జేబు రుమాలుతో ఆ కాగితం మడత విప్పాడు. కాగితంలో రోజ్ కలర్ పౌడర్ అంటుకుని వుంది. పక్కా పాడి పాట్లాన్ని, కాగితాన్ని తన జేబులో భద్రపరచి సర్వర్ ను పరీక్షగా చూశాడు.

"నువ్వు ఆటో వరకూ వెళ్లావా?" అడిగాడు శిరీష్.

"లేదు సార్ !"

"ఆటోలో ఎవరయినా వున్నారా?"

"డ్రయివర్ ఒక్కడే వున్నాడేమో సార్! వెనక సీట్లో ఎవరయినా వుంటే ఆ ఆటో తిరిగి అద్దెకు ఎలా వస్తుంది సార్?"

"కాఫీ తాగిన వ్యక్తి తనకి తానుగా ఆటో ఎక్కలేదు గాబట్టి!"

సర్వర్ తెల్లబోయాడు.

"ఆటో ఎక్కడ ఆగిందో చూపిస్తావా?"

"ఆటో ఆగడం ఏమిటి సార్? అది ఒక గంటముందు నుండీ అక్కడే వుంది!"

శిరీష్ కళ్లు ఎర్రబడ్డాయి. ముక్కుపుటాలు అదిరాయి.

"అదేలే....ఆ స్థలం చూపించు!"

సర్వర్ బయటికి నడిచి మట్టిరోడ్డుమీద ఒక ప్రదేశంలో ఆగాడు. నేలమీదకు శిరీష్ పరీక్షగా చూశాడు. చాల రకాల అడుగుజాడలు పడి టైర్ల ముద్రలు చెరిగిపోయాయి.

రెండు సిగరెట్ పీకలు టైర్ల గుర్తులకు రెండడుగుల దూరంలో పడివున్నాయి. తన జేబులోని కాగితంలోనికి వాటిని భద్రంగా సేకరించాడు శిరీష్. సువాసన వెదజల్లే సిగరెట్ల పీకలవి! సర్వర్ కి కృతజ్ఞతలు చెప్పి బయలు దేరాడు. టాక్సీని మాట్లాడుకుని ఎక్కి కూర్చున్నాడు.

టాక్సీ హైవేమీద పరుగెత్తుతోంది.

శిరీష్ కిటికీలోంచి బయటికి చూస్తూ ఆలోచనలో పడ్డాడు. సత్యనారాయణకి ఈ ఉదయాన్నే సినిమాకి కథరాసే అవకాశం వచ్చింది. ఆ వెనకనే అతడు నిర్మాత వెంట బయటికి వెళ్లాడు. లొకేషన్స్ చూపించడానికని అతడిని తీసుకెళ్ళాడట శంకర్ రాజన్.

లొకేషన్స్‌నుండి తిరిగి వస్తోనే హోటల్ మేనకాకి వచ్చి వుంటాడు సత్యనారాయణ. క్షేమంగా ఇంటికి తిరిగివెళ్ళి భోజనం చేశాడు. ఆ తర్వాత అతడిని మాయం చేశారు. ఎవరు? అతడిమీద కక్ష పెంచుకోవడం ఎందుకు? శంకర్ రాజన్ అతడిచేత తప్పుడు ఎగ్రిమెంట్లు రాయించుకోవడానికి ఈ పద్ధతిని ఎన్నుకున్నాడా?

ఆటో దొరికినా తనకి పెద్ద ప్రయోజనం వుండదు. రెండుమూడు వాహనాలు మారి తమ స్థావరం చేరుకుంటారు వాళ్ళు.

"పోలీస్ స్టేషన్ ముందు ఆపు!" అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

# 4

కళ్ళు తెరిచి చూశాను.

విశాలమైన గది. నేను బెడ్ మీద పడుకునివున్నాను. బెడ్ మెత్తగావుంది. పైకప్పూ, గోడలూ ఎర్రటి రంగులో వున్నాయి. గదిలో ఒకే ఒక్క ఎలక్ట్రిక్ బల్బూ, మధ్యలో ఫాన్. బెడ్‌కి కాస్త దూరంలో కుర్చీ వుంది. గోడలకి అటొకటి యిటొకటి కిటికీలు వున్నాయి. అవి మూసివున్నాయి.

గదిలోకి వెంటిలేటర్ ద్వారా వెలుగు వస్తోంది. పగలయి వుంటుంది.

ఉన్నట్టుండి లేవబోయాను. నా తలమీద ఎవరో సుత్తితో కొట్టినట్టయింది. కిటికీకి కాస్త ఇవతలగా పెద్ద సైజులో టెలివిజన్ సెట్టు స్టాండుమీద పెట్టివుంది. ఈ గది నాది కాదు. కనీసం నేను ఎన్నడూ ఎరిగినది కాదు. టెలివిజన్ సెట్టులు చూశాను. ఎంజాయ్ చేశాను. కాని ఇంత వైడ్ స్క్రీన్ వున్న సెట్టును చూడలేదు. నేను ఇప్పుడు ఎక్కడ వున్నాను? అన్నట్టు వనజ ఏదీ? కనిపించదేం? నన్ను ఈ గదిలోకి ఎలా తీసుకు వచ్చింది వనజ?

నా ఆలోచనలు చిన్న కాఫీ కొట్టుకు తగులుకుని ఆగి పోయాయి. అక్కడే కాఫీ త్రాగి బల్లమీద తలవాల్చాను. వనజ మెల్లగా నన్ను లేవనెత్తింది. కొన్ని అడుగులు నడవడం ఎక్కడో కూలబడటం జరిగింది. అంతే. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు గుర్తులేదు. వనజ నన్ను ఎక్కడికి తీసుకువచ్చింది?

ఆమె నిజంగా సాహిత్యాభిమాని కాదా? సాహిత్యంలో చదువుకుని ఆనందించే సంఘటనలనూ, నేరాలనూ ఆమె ప్రాక్టికల్‌గా చేయాలని కుతూహలపడుతుందా? అయినా నన్ను దాచి ఏం ప్రయోజనం? కోట్ల నల్ల ధనం మూలిగే సేట్‌జీల సంతతి వాడిని కాను కూడానూ.

ఆలోచించే కొద్దీ నాకు మతిపోయింది. నేను ఇల్లు వదిలిపెట్టి ఎంత సేపయిందో? గంటలో, రోజులో! వాచీ చూసుకున్నాను. ఏడు గంటలు దాటి అయిదు నిమిషాలయింది. ఉదయం అయివుండాలి. వెంటిలేటర్‌లోంచి వెలుగువస్తోంది. నాకు పిచ్చెత్తినట్టయింది.

నా రెండు చేతులకు తాళ్ళు కట్టివున్నాయి. ఆ తాళ్ళ కొసలు గోడవైపు వున్నాయి. తలవంచి చూశాను.

మొత్తం నాలుగు రింగులలో నాలుగు త్రాళ్ళు కట్టి వున్నాయి. మిగతా రెండు త్రాళ్ళు నా కాళ్ళవి. నా మీద వనజకు ఇంత కక్ష దేనికి? వనజలాంటి సౌందర్యవతికి నేను ఏం అపకారం చేశాను?

ఏమయినప్పటికీ వనజను అపరాధిగా ఎంచ బుద్ధి గావడంలేదు. వనజ ఎవరి ప్రోద్బలం మీదో నన్ను పట్టి బంధించడానికి సహకరించి వుంటుంది. ఆమె కళ్ళలో నాకు ఎలాంటి క్రూరత్వమూ కనిపించలేదు.

తల విదిలించాను. మెల్లగా మంచం దిగాను. నాలుగు త్రాళ్ళూ నన్ను మంచం దగ్గరే నిలబెట్టాయి. అంతకిమించి నడిచేలాగా అవకాశం యివ్వడం లేదు. నేను నిరాశగా చుట్టూ చూశాను. తాళ్ళను విప్పుకోవడానికిగానీ, కట్ చేయడానికిగానీ ఎలాంటి అవకాశమూ లేదు. సన్నటి తాళ్ళను రకరకాల ముడులు వేసి చేతులవద్ద ఇనుప రింగులు తొడిగారు. ఎవరో ఖైదీ తప్పించుకున్నట్టు వాటిని కొరికి కొరికి త్రాళ్ళను వదిలించుకోవాలి.

గదికి ఒకటే గుమ్మం వుంది. తలుపులు ఎలా తెరచు కుంటాయి? సినిమాలలో అయితే భుజాలతో తాకించి తలుపులను ఒక్క వుదటున పడగొట్టి హీరో విలన్ని దొరకబుచ్చుకుంటాడు. నేను హీరోను కాను.

"వెల్! నీ నటన చాలా బావుంది సత్యనారాయణా!"

నేను వులిక్కిపడి చుట్టూ చూశాను. ఎవరూ లేరు! వెంటిలేటర్ వద్ద నల్లగా కనిపిస్తోంది. మౌత్ పీస్ లావుంది. వెంటిలేటర్ వద్ద నిలబడి ఎవరో ఆ మౌత్ పీస్ వంటి మినీ మైక్ తో మాట్లాడారు.

"ఎవరినయినా బంధించితే వాళ్ళ నటన సహజంగా ఎలా వుంటుందో, ఆ వ్యక్తి ఎలా తెల్లబోయి అనుక్షణమూ

బెదిరిపోతూంటారో నిన్ను చూస్తే స్పష్టంగా అర్థమౌతోంది!"

"ఎవరు నువ్వు?" అరిచాను.

అవతల ప్రక్క నవ్వు వినిపించింది. తెరల తెరల నవ్వు!

క్షణాలు గడుస్తున్నాయి. తలుపువద్ద శబ్దమయింది. తలుపులు వున్నట్టుండి తెరుచుకున్నాయి. అవతల ఎవరో పనిమనిషి నిలబడివుంది. ఆమె చేతిలో తాళం చెవులున్నాయి. ఆమె నిస్సంకోచంగా లోపలకు వచ్చింది.

ఆమె దుస్తులు మాసివున్నాయి. జుత్తుకు చమురులేక ఎర్రబడివుంది. ఆమె చురుకుగా నా వద్దకు వచ్చింది.

నేను ఆమెను గమనిస్తోనే తలుపుల అవతలకు చూశాను. తలుపు అవతల గజం దూరంలో తెల్లటి గోడ తప్ప ఏమీ లేదు. వెలుగులో ఆ గోడమీద ఎవరిదో నీడ పడింది. మరుక్షణంలో గోడదగ్గర భారీ ఆకారం వున్న వ్యక్తి నిలబడివున్నాడు. అతడి చేతిలో మెషిన్‌గన్ నావైపే గురిపెట్టి వుంది.

పనిమనిషి తనవద్ద వున్న తాళంచెవులతో నా చేతుల రింగులు విప్పి, తర్వాత కాళ్ళ రింగులు విడదీసింది. నేను స్వతంత్రుడినయాను. నాకు ఒక్క క్షణంపాటు పనిమనిషిని అతడిమీదకు విసిరికొట్టి తప్పించుకు పారిపోవాలనిపించింది. నాకు ఈ భవనంలోంచి పోగలనన్న ధైర్యం వుంది.

చటుక్కున పనిమనిషిని ఒడిసిపట్టుకుని నాకు కవచంగా పెట్టుకున్నాను. క్లిక్‌మన్నది. ఆ శబ్దం మెషిన్‌గన్‌ది. సేఫ్టీకాచ్ తప్పించాడన్న మాట.

"నో ట్రిక్స్!" అరిచాడు అతను.

నేను పనిమనిషిని అలాగే పట్టుకుని గుమ్మంవైపు కదిలాను. వెంటిలేటర్ వద్ద తెరల తెరల నవ్వు వినిపించింది.

"ఇద్దరినీ షూట్ చేసెయ్యి!" అరిచాడు మైక్ లోంచి.

మెషిన్ గన్ పట్టుకున్న వ్యక్తి చటుక్కున హేండిలును కదపబోయాడు.

"ఆపండి!" అరిచాను. చటుక్కున పనిమనిషిని వదిలి పెట్టాను. వాళ్ళు టపాకాయలు కాల్చినంత సులువుగా మనుషులను కాల్చగలరు అనిపించింది. నా గురించి పనిమనిషిని బలిపెట్టడం అవివేకం!

నేను పట్టు విడిచిపెట్టగానే పనిమనిషి ఏమీ జరగనట్టుగా నడిచివెళ్ళి గదిగోడలో తాళంచెవిపెట్టి తిప్పింది. ఆశ్చర్యం! గోడలోకి తలుపు తెరుచుకుంది. అంటే అంతసేపూ తలుపు గోడ రంగులో కలిసిపోయిందన్న మాట!

"అది బాత్ రూం! త్వరగా కాలకృత్యాలు తీర్చుకో. పిచ్చివేషాలు వేయక! హింసలోకి దిగవలసి వస్తుంది!" మైక్ లోంచి అరిచాడు. నేను మౌనంగా బాత్ రూంలోకి నడిచి తలుపు మూసుకున్నాను.

# 5

స్పృహ వచ్చినప్పటినుండీ ఈ గదిలోనే ఒకరోజు గడిచిపోతోంది. చీకటిపడబోతోంది. చేతులవంక చూసుకున్నాను. మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత నన్ను కుర్చీలో కట్టి వెళ్ళిపోయింది పనిమనిషి. ఒకే పద్ధతిలో కూర్చుండి వుండటం వలన నడుమునొప్పి పెడుతోంది. బోర్ గావుంది. కాలాన్ని అమూల్యంగా భావించవలసిన కాలం అది.

శంకర్ రాజన్ నాకు పదివేల రూపాయిలిస్తాడు. నా

కథను చిత్రంగా తీస్తాడు. ఈ రెండు రోజులూ నేను కనిపించకుండాపోతే ఆయన చిత్రం ఏంగాను?

నాకు వింత ఆలోచనలు వస్తున్నాయి. ఆయన చిత్రానికేం వచ్చింది? ఎందరో హేమాహేమీలు సిద్ధహస్తులు అయిన రచయితలనుండి ఆయన తన అభిరుచికి అనుగుణంగా రాయించుకుని వంద సినిమాలు తీయగలడు. కేవలం నా అదృష్టంకొద్దీ నాకు ఈ అవకాశం వచ్చింది.

అదృష్టాన్ని నమ్మకపోయినా ఇలాంటి ఛాన్స్‌ని ఏమంటారో వ్యవహారంలో లేదు. ఇలాంటి అపూర్వమైన ఛాన్స్‌ని పోగొట్టడానికి ఎవరో నన్ను కావాలని ఈ రకంగా కిడ్నాప్ చేసి వుంచారా? ఆశ్చర్యం! నామీద కోపం ఎవరికి? ఈ మాత్రం కక్ష గట్టవలసిన అవకాశాలు వచ్చేలాగా నేను యెవరితోనూ ఘర్షణలకి దిగేవాడిని కూడా కాదు.

ఉన్నట్టుండి గదిలో చిమ్మచీకటి అలుముకుంది. వెంటిలేటర్ వద్ద నల్లటి తెర అడ్డం వచ్చినట్టుంది. చీకట్లో చూడటానికి నా కళ్ళు అలవాటు పడుతున్నాయి. అకస్మాత్తుగా చక్ మన్న శబ్దమయింది. టెలివిజన్ ఆన్ అయింది. తరంగాలు అడ్డగీతలు చకచక కదులుతున్నాయి. మిలమిలలాడే అక్షరాలు కదిలిపోతున్నాయి.

టెలివిజన్‌ని ఎవరు ఆన్ చేశారు? దానికి స్విచ్ బోర్డ్ గానీ, విద్యుత్తు ప్రవహించడానికి తీగెలుగానీ ఉన్నట్టు నేను చూడలేదు. నాకు కాలక్షేపం కోసం టెలివిజన్‌ని ఏర్పాటు చేశారన్నమాట! వాళ్ళ మర్యాదకి ముచ్చటేసింది. మా ఆవిడా పిల్లలూ వుంటే వాళ్ళు బాగా యీ టెలివిజన్ ప్రదర్శనను ఎంజాయ్ చేసేవాళ్ళు. నా కళ్ళు స్క్రీన్ మీద నిలబడిపోయాయి. చిత్రం తాలూకా

టైటిల్స్, సర్టిఫికేటూ కనిపిస్తున్నాయి. అక్షరాలు స్పష్టతను దిద్దుకున్నాయి. చదవసాగాను.

"డ్రాక్యులా హౌజ్ రిజెన్ ఫ్రం ది గ్రేవ్!" ఆశ్చర్యం! ఈ చిత్రాన్ని పదేళ్ళక్రితం చూశాను. డ్రాక్యులా సీరీస్‌లో అదే నేను చూచిన మొదటి చిత్రం! స్క్రీన్ మీద రంగులు కదులుతున్నాయి.

పన్నెండు సంవత్సరాల కుర్రవాడు చర్చిలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతడి కళ్ళలో మూగతనం, అమాయకత్వం. చర్చి మెయిన్ హాలులో పొడవుపాటి త్రాడు వ్రేలాడుతోంది. మూగకుర్రవాడు త్రాడు దగ్గరకు వచ్చాడు. చర్చి గంటకి కట్టిన త్రాడు అది. గంట మ్రోగించడానికి కాబోలు వాడు త్రాడును అందుకుని లాగాడు. గంట మ్రోగలేదు. నా గుండెలలో ఉద్రేకం మొదలయింది.

గంట యెందుకు మ్రోగలేదో గుర్తొస్తోంది. నాకు ఒళ్ళు చెమటలు పట్టింది. కుర్రవాడి చేతికి జిగటగా తగిలింది. వాడు ప్రశ్నార్థకంగా తాడు వెంబడే పైకి చూశాడు. సీలింగుకి వున్న రంధ్రంలోంచి త్రాడు పై అంతస్తుకి వెళ్తోంది. త్రాడు వెంబడే రక్తం కారి అంటుకుని గాలికి జిగటకట్టింది.

కుర్రవాడి కళ్ళలో ఆసక్తి! భయం! చకచక మెట్లు ఎక్కి వాడు పై అంతస్తుకి వెళ్ళాడు. బ్రహ్మాండమైన గంట వ్రేలాడుతోంది.

"డంగ్!" విపరీతమైన స్థాయిలో డంస్ మ్రోగాయి. గదిలో స్టీరియో శబ్దం ఒక్కసారిగా నన్ను భయంకపింతుడిని చేసింది.

గంటలో మధ్య రాడ్ వ్రేలాడే స్థలంలో స్త్రీ శవం

తలక్రిందులుగా వ్రేలాడుతోంది. ఆమె కంఠంలోంచి నెత్తురు పీల్చినట్టు గాయం! శవం కళ్ళు పత్తికాయల్లాగా పగిలివున్నాయి. నాకు కడుపులో దేవింది. నా చుట్టూ చీకటి. నన్ను ఒంటరిగాడిని చేసి ఈ హారర్ సినిమాను చూపిస్తున్నారు. పదేళ్ళక్రితం ఈ చిత్రం చూసి తారెత్తాను. ఇంగ్లీషు చిత్రాల్లోని చిత్రీకరణ అతిసహజంగా, మరీ భీభత్సంగా వుంటుంది.

మూగవాడు పెడబొబ్బలు పెట్టుకుంటూ బాణంలాగా రోడ్డుమీద దూసుకుపోతున్నాడు. నేను ఒక్క ఉదుటున లేచివెళ్ళి టెలివిజన్‌ని ఆఫ్ చేయాలనుకున్నాను. నా బంధనాలు నన్ను మరింత గట్టిగా నొక్కుతున్నాయి. చేసేదిలేక కళ్ళు మూసుకున్నాను. స్టీరియో శబ్దాలు చెవులను అదరగొడ్తున్నాయి.

అకస్మాత్తుగా శబ్దాలు ఆగి ఇంగ్లీషులో సంభాషణలు వినిపిస్తున్నాయి. మూగకుర్రాడిని గ్రామస్తులు ప్రశ్నలు వేస్తున్నారు. చర్చి అసమర్థంగా వూరుకోరాదని గ్రామస్తులు ప్రతిపాదనలు చేస్తున్నారు.

సినిమా చకచక సాగుతోంది. నాకు చూడ బుద్ధి కావడంలేదు. కాని యెంతసేపని కళ్ళు మూసుకోను? రెప్పలు నొప్పిపుడుతున్నాయి. ఇదో కొత్తరకం హింస అనుకుంటాను. హింస విషయం అలా వుంచితే నన్ను ఏ ప్రయోజనంతో ఈ రకంగా వుపయోగించుకుంటున్నారో మాత్రం తెలియరావడం లేదు.

కళ్ళు తెరిచాను. స్క్రీన్‌మీద చర్చిఫాదర్ కనిపించాడు. అతని వెంట గ్రామపెద్ద కొండ ఎక్కుతున్నాడు. కొండమీద డ్రాక్యులా భవనం వుంది. 'గంటలో స్త్రీ శవం' గ్రామస్తులలో బాగా అలజడి

తెచ్చింది. ఆ శవం అక్కడ వుండటానికి కారణం డ్రాక్యులా తన భవనంలో తిరిగిపడికి చెలరేగడమా కాదా అన్నది తేల్చుకోవడానికి వాళ్ళిద్దరూ బయలుదేరుతున్నారు.

ఫాదర్ ఒకదారిన, గ్రామపెద్ద ఒకదారిన విడిపోయి కొండ యెక్కుతున్నారు. పెనుగాలికి వాళ్ళ దారులు విడిపోయాయి. ఫాదర్ తన సీసాలోంచి మద్యంతీసి త్రాగుతాడు. గాలి తాకిడికి క్రిందకు జారి పడతాడు. చర్మం చిట్లి రక్తం కారుతుంది.

ఆ రక్తం నేలలోకి ఇంకి సరిగ్గా అక్కడే పాతిపెట్టిన డ్రాక్యులా శవం పెదిమలకు అంటుకుంది. ఫాదర్ దగ్గరలో వున్న నీటిచెలమలో రక్తం కడుక్కోబోతాడు. ఆ నీటిలో పొడవుపాటి కోటు వేసుకున్న ఆకారం ప్రత్యక్ష్యమవుతుంది. కోల మొహం.

ఫాదర్ బెదిరి వెనక్కి తిరిగి చూస్తాడు.

డ్రాక్యులా. అతడి కళ్ళు పచ్చగా వున్నాయి. పొడవుపాటి ముక్కు, స్థిరమైన పట్టుదలా, ప్రపంచాన్ని జయించాలనే యావా అతడి కళ్ళలో రక్త పిపాసా.... ఫాదర్ ఠారెత్తిపోతాడు. పారిపోబోతాడు.

కుర్చీలో వెనక్కి వాలాను. స్టీరియో శబ్దం భయంకరంగా వుంది. కళ్ళు మూసుకున్నాను. నా ప్రక్కన అలికిడయింది. డ్రాక్యులా నా ప్రక్కకి వచ్చి నిలబడినట్టయింది....అంతే! స్పృహ తప్పింది నాకు.

# 6

డిటెక్టివ్ శిరీష్ కారు ఆపాడు.

చుట్టూ కొండలు. ఒక ప్రక్క సముద్రం. హోరుగాలి బట్టలనూ జుత్తునూ రేపుతోంది. కొండల మధ్య లోయ

లోకి సన్నటి కాలిబాట వెడుతోంది. శిరీష్ తను వచ్చిన కారుకి తాళంపెట్టి దిగి కాలిబాట పుచ్చుకున్నాడు. మెరక దాటి అర మైలు నడిచాక చెట్లగుబురులో అలజడి వినిపిస్తోంది. "లైట్స్....ఎస్....మూవ్....డైలాగ్" లాంటి మాటలను ఉండి ఉండి గాలి మోసుకు తెస్తోంది.

శిరీష్ గుబురువైపు నడిచాడు. చెట్లకి యివతల కొందరు మనుషులు ట్రాలీ బాగుచేస్తున్నారు. మరికొందరు వైరింగ్ పనులు చేసుకుంటున్నారు.

డిటెక్టివ్ శిరీష్‌ను వాళ్ళు పట్టించుకోలేదు. చెట్ల గుబురులో ప్రవేశించాడు.

ఎదురుగా లంకంత భూతాల కొంత. ఏ నాటిదో పాత బడి వర్షాలకు పుచ్చిపోయిన గుర్రపుబగ్గీ భూతాల కొంప ముందు పడివుంది. భవంతిగా వుండవలసిన ఆ కట్టడం అటూ యిటూ కూలిపోయి కొంపలాగా తయారయింది. దానిచుట్టూ వున్న ఆవరణలో వందలాది ప్రేక్షకులు నిల బడి వున్నారు.

ప్రేక్షకుల వలయం మధ్య షూటింగ్ జరుగుతోంది. పెద్దస్టాండు మీద కెమెరా దాని యెదురుగా ఫ్లడ్ లైట్స్ పట్టుకున్న మనుషులూ, లైట్స్‌కీ, కెమెరాకీ మధ్య నటీ నటులూ, కెమెరా ప్రక్కగా కెమెరామాన్, అతడి అసి స్టెంటూ....అతడి ప్రక్కగా....

డిటెక్టివ్ శిరీష్ చటుక్కున సూచనలిస్తోన్న శంకర రాజన్‌ని సమీపించాడు. శంకరరాజన్ సూచనలివ్వడం ఆపి వ్యూఫైండర్‌లోకి వొంగిచూచి, "ఈ కట్టడం బాక్ గ్రౌండ్‌తో హీరో హీరోయిన్‌లను రెండు షాట్స్— మొహంలో మొహంపెట్టి క్లోజప్‌లో .... లైటింగ్ మీడియమ్...." అంటున్నాడు.

షాట్ మొదలయింది.

"శంకరరాజన్ గారూ!" పిలిచాడు డిటెక్టివ్ శిరీష్.

శంకరరాజన్ తలత్రిప్పి చూశాడు. "హలో మీరు... శిరీష్ కదూ, '70 ఎం. ఎం. ఫిలిం' కేసులో మా స్టూడియోకి వచ్చారు" అన్నాడు శంకరరాజన్.

శిరీష్ తలూపి, "థాంక్యూ, మీ బిజీలో కూడా మీరు నన్ను గుర్తుంచుకున్నారు. మీకు కాస్త తీరిక దొరికితే నాతో ఒక పావుగంట స్పేర్ చేయగలరా?" అన్నాడు.

"తప్పకుండా! పరాంకుశం! నేను అలా వెళ్ళివస్తాను. షాట్ పెర్ఫెక్ట్‌గా రావాలి" అంటూ శిరీష్ వెంట నడిచాడు శంకరరాజన్.

ఇద్దరూ నడుచుకుంటూ చెట్ల గుబురువైపు వెళ్ళారు. శంకరరాజన్ తన చొక్కా జేబులోంచి గోల్డెన్ సిగరెట్ కేసుతీసి సిగరెట్ ఆఫర్ చేశాడు. శిరీష్ తల అడ్డంగా త్రిప్పి. "థాంక్స్!" అన్నాడు.

శంకరరాజన్ సిగరెట్టు ముట్టించి పొగపీల్చాడు. సువాసన గాల్లో వ్యాపించింది.

"అడగండి. మీకు నేను ఏం సమాచారం యివ్వగలను?"

శంకరరాజన్ వైపు చూశాడు శిరీష్.

"నా మిత్రుడి వ్యవహారంలో మీ చిత్ర నిర్మాణం గురించి కొన్ని వివరాలు అడుగుతాను. దయచేసి చెబుతారని నమ్ముతున్నాను" అన్నాడు శిరీష్.

"మీ మిత్రుడా? ఆయనెవరు?" అడిగాడు శంకరరాజన్.

"మీరు కథ రాయించుకోవాలనుకున్న ఎమ్.వి.వి..."

"అతడా! బలే రచయితండీ బాబూ! కాంట్రాక్టు

రాయించుకుందామనుకున్న సమయం నుండీ మనిషి మిస్సయిపోయాడు!"

"మీరు కథ రాయించుకోవడం కోసం మరొకరిని సంప్రదించవలసి వచ్చిందనుకుంటాను."

"అబ్బే! అదేం లేదు. నేను అతడి కథను సినిమాగా తీయాలనుకున్నప్పుడు నా నిర్ణయం మారే ప్రసక్తి లేదు. స్క్రిప్టు అతడిదే!"

శిరీష్ ఆశ్చర్యంగా చూశాడు.

"రెండు రోజులలో కొన్ని సీన్స్ ఇస్తానన్నాడు. లొకేషన్స్‌ని దృష్టిలో పెట్టుకుని రాశాడు. నాకు రోజుకి రెండు మూడు సీన్సు చొప్పున యిస్తున్నాడు. ఈ లోపులో నేను పాటలను చిత్రీకరించుకుంటున్నాను. మరో గంటలో సెకండ్ యూనిట్ యారాడ కొండ మీద షూటింగ్ మొదలుపెడుతుంది."

"స్క్రిప్టు భాగాలు మీకు ఎలా అందిస్తున్నాడు?"

"నా హోటలు రూంకి బాయ్ చేత పంపిస్తున్నాడు."

"అతడు యింట్లోంచి బయటికి వెళ్ళి మూడు రోజులయింది."

శంకరరాజన్ నవ్వాడు. "రచన సాగదని అజ్ఞాతవాసం చేస్తున్నాడన్న మాట! మా సినిమా రచయితలంతా మహాబలిపురంలో దాక్కుంటారు" శంకరరాజన్ సిగరెట్టు ఆర్పి క్రింద పారేశాడు.

"అతడిని ఎవరో ఎత్తుకుపోయారు?"

"ఈజిట్?"

"అవును. మూడురోజుల క్రితం ఎవరో అభిమానినని వనజ అనే అమ్మాయి వచ్చింది. అతడు త్రాగే కాఫీలో మత్తుమందు కలిపి ఆటోలో తీసుకువెళ్ళింది."

"నమ్మదగిందిగా లేదు."

"ఏం?"

"సత్యనారాయణ చంటిపిల్లవాడు కాదు!"

"కరెక్టు! వనజకి పరిసరాలూ, పరిస్థితులూ బాగా అనుకూలించాయి."

"అతడిని యెత్తుకుపోవలసిన అవసరం యెవరికి వుంటుంది?"

"అతడూ వనజా యెక్కిన ఆటో దగ్గర ఈ సిగరెట్ పీకలు రెండువున్నాయి" అంటూ శిరీష్ క్రిందపడిన సిగరెట్టుపీకను పైకితీశాడు.

"ఇదేమిటి? అనుమానం నా మీదకు వచ్చిందా?"

శిరీష్ చురుకుగా చూశాడు.

"ఈ బ్రాండ్ సిగరెట్టు తాగేవ్యక్తి ఆటోలో కూర్చుండి వుండగా వనజ సత్యనారాయణను నడిపించుకుంటూ వచ్చి ఆటోలో ఎక్కించింది!"

"నాకు అతడిని యెత్తుకుపోవలసిన అగత్యం ఏమిటి?"

"మీకు ఆ అగత్యం లేకపోవచ్చు. మొదటి అనుమానితులు మీరు."

"మై గుడ్ నెస్! అలాంటి చిన్నసైజు రచయితలో కాంట్రాక్టు రాయించుకోవడం నాదే తప్పు!"

"కాంట్రాక్టుకి సొమ్ము చెల్లించారా?"

"అయిదువేలు అడ్వాంసు యిచ్చాడు. పిచ్చర్ రిలీజ్ నాడు మిగతా అయిదువేలూ యిస్తాను. నా దగ్గర పని చేసే ఆర్టిస్టులకూ, టెక్నీషియన్లకూ నేను ఈ పద్ధతిలోనే సొమ్ము చెల్లిస్తాను."

"రసీదు చూడనిస్తారా?"

"తప్పకుండా. రసీదు పంపుతూ యూనివర్శిటీ స్టేట్

బాంకులో తన అక్కౌంటుకి అయిదువేలూ క్రెడిట్ చేయించమని కోరాడు. అలాగే చేశాను."

శరీఫ్ తల విదిలించాడు.

"మిష్టర్ శరీఫ్! నేను సత్యనారాయణను కిడ్నాప్ చేస్తే నా మీద అనుమానం వచ్చేలాగా యెందుకు ప్రవరిస్తాను?"

"అంటే?"

"అసలు కాంట్రాక్టు వరకూ వ్యవహారం రానే రాదు కదా! పైగా సిగరెట్టు పీకలు—అవీ ప్రత్యేకంగా కొంతమందే వాడగలిగిన సిగరెట్లు అనుమానాస్పదమైన పరిసితులలో యెలా వదులుతాను?"

శరీఫ్ అతడిని పరీక్షగా చూచి, "ఈ సిగరెట్లు మీ యూనిట్‌లో మరెవరైనా కాల్చుతారా?" అన్నాడు.

శంకరరాజన్ చిరాకుగా చూశాడు. "ఏం చెప్పగలను? లెక్కా జమా తెలీని రంగం మాది! నా సిగరెట్స్‌ను యెవరయినా అపహరించి కాల్చగలిగే సావకాశాలు వుండవచ్చు. ఉండకపోనూవచ్చు. రండి రసీదులు చూపిస్తాను!"

## 7

క్రైంబ్రాంచి ఇన్స్‌పెక్టర్ కుమార్ నిట్టూర్చాడు. చురుకుగా శరీఫ్‌ని చూచి, "కేసు ముందుకు నడిస్తేనే కాని, మేము అడుగుపెట్టడానికిలేదు. పైగా సత్యనారాయణ తరఫున ఎవరూ ఎలాంటి ఫిర్యాదు చేయనిదే నేను అధికారికంగా ఈ విషయంలో ఏం కలగజేసుకోను?" అన్నాడు.

శరీఫ్ ఆశ్చర్యంగా చూచి, "అతడి భార్య కంప్లయింట్ ఇస్తానన్నది. ఇంతలో ఏమయింది?" అన్నాడు.

"కంప్లయింట్ ఇవ్వనున్నట్టు నీకు యెప్పుడు చెప్పింది?"

"నిన్న సాయంత్రం."

"యెందుకయినా మంచిది. అతడి ఇంట్లో ఎలాంటి ప్రమాదమూ రాలేదుకదా—కానిస్టేబులును అక్కడ మఫ్టీలో వుంచనా?"

"దట్టీజ్ బెటర్! నేను ఒకసారి చూసివస్తాను" డిటెక్టివ్ శరీఫ్ లేవబోయాడు.

"పది నిముషాలు ఆగు. వేలిముద్రల రిపోర్టులు వచ్చాయి."

శరీఫ్ ఆసక్తిగా చూశాడు.

"సత్యనారాయణా, వనజా యెక్కి వెళ్ళిన ఆటోవద్ద దొరికిన సిగరెట్ పీకలమీది వేలిముద్రలు శంకర్ రాజన్‌వి కావు."

శరీఫ్ అలాగేవన్నట్టు తలూపాడు.

"పాత నేరస్తులివీ కావు. సిగరెట్ పీకలతో బాటు నీకు చిన్న హోటలులో దొరికిన వక్కపొడి పొట్లం మీద ఆడదాని వ్రేలిముద్రలున్నాయి. ఆమె పాత నేరస్తురాలు కాదు."

"శంకర్ రాజన్‌తోనే ఆ సిగరెట్లు విశాఖపట్నం వచ్చినట్టున్నాయి. అవి ఇక్కడ దొరకవు. దిగుమతి సరుకులు అమ్మే వ్యక్తులందరినీ దర్యాప్తు చేశాను. మద్రాసులో స్మగుల్ అయే సిగరెట్లు అవి!" అన్నాడు శరీఫ్.

కుమార్ కోపంగా చూచి, "కస్టంస్ వాళ్ళకి తెలియపరిస్తేనో...." అన్నాడు.

శరీఫ్ హేళనగా నవ్వాడు. "నీను తెలియని ధర్మ

సూక్ష్మం కాదు. యెక్కడికక్కడ బిస్కట్లు పెట్టి మచ్చిక చేసుకునే తెలివైన మనుషులుంటారు ఈ పుణ్యభూమిలో. యెటొచ్చీ శంకర గిరి మన్యాలు పట్టిపోయేది నీలాగా నిజాయితీ ప్రదర్శించేవాళ్ళే!"

కుమార్ నవ్వలేక నవ్వి "సత్యనారాయణ రాసి యిచ్చిన కాంట్రాక్టూ, అయిదు వేలు అందినట్టు రాసి యిచ్చిన రశీదూ శంకర్ రాజన్ వద్ద పరిశీలించావు కదా! వాటిమీద నీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు.

"వాటిలో ఎలాంటి లోపమూ లేదు. సత్యనారాయణ అక్కౌంట్ లో జమ అయినట్టు బాంకులో తెలుసుకున్నాను."

"అయితే ఇక మనకి ముందుకుపోయేదారి ఏం తెలుస్తుంది?"

"నువ్వూరా! సత్యనారాయణ యింటికి వెళ్దాం. ఏమైనా వివరాలు తెలియవచ్చును."

కుమార్ జీపు బయలుదేరతీశాడు. పావుగంటలో ఇద్దరూ సత్యనారాయణ ఇంటికి వెళ్ళారు. డ్రాయింగ్ రూంలో కూర్చున్నారు.

"ఆయన వద్దనుండి ఈ వుత్తరం వచ్చింది. అందుకే నేను రిపోర్ట్ ఇవ్వలేదు" అంటూ సత్యవతి ఒక మూపైఫైదు పైసల కవర్ అందించింది.

డిటెక్టివ్ శిరీష్ కవరు అందుకుని తెరచి చూశాడు. తెల్లటి కాగితం బయటపడింది.

"ప్రియమైన సత్యా!

నేను కులాసాగా వున్నాను. త్వరలో ఇంటికి వస్తాను. ఏకాంతం కోసం ఇలా ప్రవర్తించాను.

—సత్యనారాయణ."

చదవడం ముగించి శిరీష్ ఉత్తరాన్ని కుమార్ కి అందించాడు. శిరీష్ పై కవరును పరీక్షగా చూశాడు. పోస్టాఫీసులో అమ్మే యెర్రటి స్టాంపింగ్ వున్న కవర్ అది. డి-ఫేసింగ్ వాల్తేరు ఆర్.ఎస్.లో జరిగింది. ముందు రోజు ఉదయాన్నే పోస్టులో వేశారు. సాయంకాలం అందింది.

"లోకల్ డెలివరీ!" అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

కుమార్ తలూపి, "ఏకాంతం ఎక్కడో రాసివుంటే బావుండేది!" అన్నాడు.

"రాసివుంటే కాదు — రాయించి వుంటే!" అని నాలుక కరుచుకున్నాడు శిరీష్. సత్యవతి వద్ద సెలవు పుచ్చుకుని ఇద్దరూ బయటికి నడిచారు.

## 8

కళ్ళు తెరచి చూశాను.

ఒళ్ళంతా నొప్పులుగా వుంది. ఈ గది తోడిదే జీవితమైపోయింది.

మూడు రోజులయింది కాబోలు. ఈ మూడు రోజుల్లోనూ ఏ ముప్ఫయిసార్లో టెలివిజన్ మీద డ్రాక్యులా సీరీస్ చూశాను. తల దిమ్మెక్కిపోయింది. ఆ టెలివిజన్ ఎలా ఆన్ చేయగలుగుతున్నారో, ఆఫ్ చేయగలుగుతున్నారో ఆపరేషన్ విచిత్రంగా వుంది. నాకు ఎటు చూచినా ఈ గదిలో డ్రాక్యులాతో భయంకర సంఘటనలూ, స్టీరియో శబ్దాల రొదా గుర్తు వస్తున్నాయి. ఈ భవనం ఎక్కడ వుందో చూచాయగా తెలుస్తోంది.

వాచీ చూసుకున్నాను. మధ్యాహ్నం రెండయింది.

వెంటిలేటర్ లోంచి చక్కటి వెలుగు గదిలో పరుచుకుంటోంది. చెవులు రిక్కించి వినసాగాను. ఎండవాలును

బట్టి నా గది గుమ్మం ఉత్తర దిశగా వున్నట్టు అర్థం చేసుకోగలిగాను. పావుగంట గడుస్తోంది. నా శ్రమ వృధా కాలేదు. ఆకాశంలో ఝుంమంటూ శబ్దం వచ్చింది. ఆ శబ్దం ఏమిటో నాకు తెలుసు. విశాఖపట్నం విమానాశ్రయానికి కలకత్తానుండి హైదరాబాద్ పోతూ మధ్య ఆగే విమానం శబ్దం అది! భవనం మీదనుండి బంయ్‌మంటూ దూసుకుపోతోంది. ప్రొపెల్లర్స్ హోరు పెడుతున్నాయి.

దగ్గరలోనే విమానాశ్రయం వుండబట్టి విమానం నేల మట్టానికి దిగువగా ఎగురుతోంది. మరి కొన్ని క్షణాల్లోనే అది చక్కర్లుకొట్టి నా గదిమీదుగా ఎగిరివెళ్ళింది. గాలిలో విమానం శబ్దాలు గిరికీలు కొడుతున్నాయి. ప్రొపెల్లర్స్ హోరులోంచి ఈల వినిపిస్తోంది. క్రమంగా ఈల శబ్దం సన్నబడి రెక్కలు తిరుగుతోన్న గాలికోత శబ్దం వినిపిస్తోంది. విమానం లాండ్ అయిందన్నమాట.

ఆ లెక్కన నేను విమానాశ్రయానికి దగ్గరగా వున్న భవనంలో వున్నానన్నమాట. విమానాశ్రయానికి ఉత్తర దిశగా ఈ గది వుంది! చేతులకు కట్టివున్న తాళ్ళతో కాళ్ళను కట్టడంవలన నాకు శరీరం కదపడానికి లేదు.

కాళ్ళను నేలకు తాటించి మెల్లగా కుర్చీని కదిపాను. అతికష్టంమీద కుర్చీని సెంటీమీటర్ చొప్పున కదుపుతూ బెడ్ వైపు కదిలాను. ఉదయం షేవ్ చేసుకోవడానికి పనిమనిషి బ్లేడు యిచ్చినపుడు దాన్ని తిరిగి రేజర్‌తో బాటు ఆమెకి వాపస్ చేయలేదు.

బెడ్ మీద తలగడ క్రింద బ్లేడును జాగ్రత్త పెట్టుకున్నాను. చేయి వున్నవైపు కుర్చీని మెల్లగా తలగడ ప్రాంతంవైపు నడిపాను. చేతివ్రేళ్ళతో అతికష్టంమీద

బ్లేడును అందుకున్నాను. వేళ్ళ సహాయంతో కుడిచేతిలో బ్లేడును పొజిషన్‌లో పెట్టాను.

ఎడం చేతికి కట్టిన తాళ్ళను కోయసాగాను. మధ్య మధ్య బ్లేడు జారిపోతోంది. చేతులు చెమటలు పడుతున్నాయి. అయినప్పటికీ పండ్ల బిగువున బ్లేడును జరుపుతున్నాను. సాయంకాలం అయిదు గంటలవరకూ నా గదికి ఎవరూ రారు. ఈలోపులో నేను సాధించాలి.

తాళ్ళు తెగాయి. ఎడంచెయ్యి స్వతంత్రమయింది. పావుగంటలో నేను కుర్చీలోంచి లేచి శ్రమ తీరేలా ఒళ్ళు విరుచుకున్నాను. కీళ్ళు కరకరలాడాయి. చకచక నా మంచం మీద బెడ్ ఎత్తి, కవర్ అందుకున్నాను. రాత్రి కొంత అన్నాన్ని మిగిల్చుకున్నాను.

ఎవరైతే నన్ను బంధించారో ఆ వ్యక్తి నాచేత రోజూ కొన్ని సీనులు రాయించి తీసుకెళ్తున్నాడు. అతడే ఈ కాగితాలు నాకు అందించేటప్పుడు ఒక కాగితాన్ని తీసి దాచాను. అన్నం మెతుకులతో దాన్ని కవర్ ఆకారంలో అతికించాను. అతికించకముందు ఆ కాగితం మీద కొన్ని వివరాలు రాయాలనుకున్నాను. కాని సాధ్యపడలేదు.

ఇప్పుడు అవకాశం దొరికింది. అదృష్టవశాత్తు పనిమనిషి కలం తీసుకుపోయినా బతిమాలగా బతిమాలగా చిన్న పెనిసలు ముక్క అందించింది.

"ఈ పెనిసలు ముక్క దేనికి?" అడిగింది పనిమనిషి.

"కొత్త కథలు రాసుకోవాలంటే ఏవో ఆలోచించుకుని వాటిని కాగితం మీద నోట్ చేసుకుంటాను. లేకపోతే మరచిపోయే ప్రమాదం వుంటుంది కదా!" విషయాన్ని దాటవేశాను.

ఆమె నమ్మిందో లేదో కాని, జాలిగా చూచి నన్ను కుర్చీకి కట్టి వెళ్ళిపోయింది. ఆలోచనలను ఆపి నా చేతిలోని పెనిసలు ముక్కవైపు చూశాను. కవరు లోపలి గోడమీద పెనిసలుతో బరకసాగాను.

వెంటిలేటర్ మీద మైకు క్లిక్ మన్నది. తలెత్తి చూశాను. వెంటిలేటర్ వద్ద ఎలాంటి నీడా కనిపించలేదు.

"సత్యనారాయణా! నిద్రపోతున్నావా?" వినిపించింది మైకులోంచి.

"లేదు. కుర్చీలో కట్టివుంటే ఎలా నిద్రపోను?"

"డ్రాక్యులాను చూపించమంటావా?"

"చూపించు."

"ధైర్యం వచ్చిందన్నమాట!"

"పదే పదే చూడటం వలన భీభత్సం చప్పబడిపోయింది!"

"నీ 'నల్లకారు' నవలలోని చివరి ఛేజింగ్ సీనులగాయితూ 'శుభం' వరకూ స్క్రిప్టు రాయాలి!"

"ఇప్పుడు నాకు ఓపిక లేదు!"

"ముద్దుగా చెబితే వినవల్లే వుంది. నా చేతివాటం రుచి చూస్తే జన్మలో మరచిపోవు!"

"రా! అదొక్కటే తక్కువ!"

"ఆల్ రైట్! నీ కోరిక ఎందుకు కాదనాలి! వస్తాను!"

"ఎక్కడికి?"

"నీ గదిలోకి!"

అతడు నా గదిలోకి వచ్చి రభసచేసేలా వున్నాడు. అతడు కోరినట్టు చిత్రానికి కథ రాస్తోన్నట్టు అగ్రిమెంటు రాశాను. అయిదువేల రూపాయిలూ అందుకున్నట్టు రశీదు

మిచ్చాను. నా "నల్లకారు" నవలికను నాటికీకరణ చేసి మిస్తోన్నాను. మానసిక హింసను తట్టుకోలేక అతడికి దాసోహమన్నాను.

రాత్రింబవళ్ళూ నిద్రపోకుండా హారర్ సినిమాలు చూచి నా మనసు తట్టుకోలేకపోయింది. మెదడులో భీభత్సం తప్పించి మరేమీ మిగిలేలాగా లేదు. అందుకే 'నల్లకారు' నవలకి సంబంధించి సర్వ హక్కులకూ కాగితం రాసిచ్చేశాను. ఇన్నింటికి తలవొగ్గి చివరకి క్లైమాక్స్ సీనులు రాయడానికి ఆటంకపెట్టే సాహసం ప్రదర్శించడం దేనికి?

"ఇదిగో మిస్టర్ శంకర్ రాజన్! నువ్వు నాతో సినిమాకి కథ రాయించుకుంటానని ఈ రకంగా నన్ను కిడ్నాప్ చేయడం నేరం! పోతే పోనియ్యి నవల! ఇప్పటికయినా నన్ను మర్యాదగా వొదిలిపెట్టు!" గంభీరంగా అరిచాను. ఒంటిన బంధనాలు లేకపోవడం నాకు తెగింపునిచ్చాయి.

"ఈ రోజు నీ గొంతు వింతగా వుంది! ఏమిటి కారణం?" మైకులోంచి వ్యంగ్యంగా వినిపించింది.

"నా కోసం పోలీసులు వెతుకుతూండవచ్చును."

"ఎందుకు వెతుకుతారు? నువు క్షేమంగా వున్నట్టు ఇంటికి ఉత్తరం రాశావ్ కదా!"

నిజమే! అన్ని ప్రక్కలా దిగ్బంధనం చేసుకున్న నాకు పోలీసులుగానీ, శిరీష్‌గానీ ఏం సహాయం చేయగలరు?

"చిత్రం క్లయిమాక్స్‌కి వచ్చేసిందా?"

"అవును. నగరం వెలుపలి సీన్స్ అయిపోయాయి. నగరంలో ఛేజింగ్ దృశ్యాలూ, ఓవర్ బ్రిడ్జి మీద పోరాటాలూ, చివరగా విలన్‌తో సంభాషణలూ, పోరాటమూ చిత్రీకరిస్తే చాలు-మిగిలింది ఇన్‌డోర్‌లో."

"ఎలా తీశారు? మిగతా పిక్చరంతా నేను రాయలేదు కదా!"

"నేను రాసుకున్నానులే!" అతడు పకపక నవ్వాడు.

శంకర్ రాజన్ సామాన్యుడు కాడు. అన్నింట్లోనూ ప్రవేలుంది.

"చిత్ర నిర్మాణం పూర్తయాకనయినా నన్ను వదులుతావా?"

"ప్రశ్నలు వేయక! పనిమనిషి కాగితాలూ కలం తెచ్చి యిస్తుంది. నోర్మూసుకుని సీన్స్ రాయి!"

## 9

"ఇతడు నా బావమరిది పరాంకుశం!" అన్నాడు శంకర్ రాజన్.

పరాంకుశంతో కరచాలనం చేశాడు డిటెక్టివ్ శిరీష్.

"మీ బావగారి పిక్చర్లకి మీరే ప్రొడక్షన్ మేనేజరా?" అడిగాడు శిరీష్.

"లేదండి! ఈ పిక్చర్ కే పని చేస్తోన్నాను" అన్నాడు పరాంకుశం.

"మద్రాసులో మీరు ఏం చేస్తోంటారు?"

"పరాంకుశం పబ్లికేషన్స్ అని డిటెక్టివ్ నవలలూ, పిల్లల జానపద నవలలూ ప్రచురిస్తాను. పేరు మీరు వినే వుంటారు."

శిరీష్ తలూపాడు. అపరాధ పరిశోధన సాహిత్యం పేరుతో సెక్స్ సీనులు చూపించి సొమ్ము చేసుకుంటాడు! పాఠకులలో అతడి నవలలకు మోజు వుంది, అసహ్యమూ వుంది అంటూండేవాడు సత్యనారాయణ.

"అవును. విన్నాను."

పరాంకుశం సిగరెట్టు పెట్టె తీశాడు. మూత తెరచి

సిగరెట్లు ఆఫర్ చేశాడు. శిరీష్ అందుకోలేదు. పరాంకుశం అతడిని వింతగా చూశాడు.

"వీరు కాల్చరులే!" శంకరరాజన్ చెయ్యి చాపి తను ఓ సిగరెట్ అందుకుని ముట్టించుకున్నాడు. పరాంకుశం ఒక సిగరెట్టు తీసుకున్నాడు.

బల్లమీద టెలిఫోన్ మ్రోగింది. పరాంకుశం రిసీవర్ అందుకున్నాడు. అవతల ప్రక్క ఆడగొంతు వినిపించింది.

"హలో పరాంకుశం హియర్!" అన్నాడు పరాంకుశం.

అవతలనుండి ఏదో వినిపిస్తోంది.

"సారీ.... రాంగ్ నెంబర్!" పరాంకుశం ఫోన్ పెట్టేశాడు.

డిటెక్టివ్ శిరీష్ చురుకుగా చూశాడు. వాచీ చూసుకున్నాడు. ఇద్దరి దగ్గరా సెలవు పుచ్చుకుని క్రిందకు వెళ్ళాడు. మేనకా హోటల్ కి సంబంధించిన టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వుందక్కడ.

"ఏం కావాలండీ?" అడిగింది టెలిఫోన్ ఆపరేటర్ హెడ్ ఫోన్ తీసిపట్టుకుని.

"ఇప్పుడు అయిదు నిమిషాల క్రితం రూం నెం. 17కి వచ్చిన ఫోన్ యెక్కడినుండో చెబుతారా?"

"యెవరో ప్రైవేటేషన్ నుండి చేశారు.... పేరు.... వనజ!"

డిటెక్టివ్ శిరీష్ తన ఉలికిపాటును కప్పిపుచ్చుకున్నాడు. శంకర్రాజన్ తాగే ఖరీదయిన సిగరెట్లు పరాంకుశం కూడా తాగుతాడు.

పరాంకుశం ప్రొడక్షన్ మేనేజర్ గా వుండికూడా షూటింగ్ లకు కావలసిన సరంజామాను సర్దుబాటు

చేయలేకపోతున్నాడు. షూటింగు వదిలిపెట్టి అతడు యెటో వెళ్ళిపోతున్నందుకు శంకర్ రాజన్ అతడిమీద విరుచుకుపడినట్లు లైట్ బాయ్స్ చెప్పుకోవడం తాను విన్నాడు.

పరాంకుశం యెక్కడికి వెడుతున్నాడు? వనజకీ అతడికీ సంబంధం ఏమిటి?

"వనజ కేవలం పరాంకుశంగారి పేరు చెప్పి కనెక్షన్ అడిగింది కదూ!" అడిగాడు శిరీష్.

ఆపరేటర్ తలూపింది. ఆమెకు కృతజ్ఞతలు చెప్పుకుని బయటపడ్డాడు శిరీష్. తాను అక్కడున్నట్టు గుర్తించి పరాంకుశం తనకి వచ్చిన ఫోన్ కాల్ ని రాంగ్ నెంబర్ అంటూ రిసీవర్ ని క్రెడిల్ చేశాడు. వనజ, పరాంకుశం కలిసి సత్యనారాయణను యెత్తుకువెళ్ళి పోవడంలో అంతరార్థం ఏమిటి?

డిటెక్టివ్ కళ్లు మెరిశాయి. వెనక్కి త్రిప్పి కారును పోలీస్ స్టేషన్ వైపు పోనిచ్చాడు.

కుమార్ తో, "పరాంకుశం పబ్లికేషన్స్ భవనంవైపు అక్కడి క్రైంబ్రాంచి ఏజంటును పంపించు. వివరాలు తెలియవచ్చును" అని చెప్పి శిరీష్ తిరిగి బయలుదేరాడు.

# 10

శిరీష్ ఓపికగా కాచుక్కూచున్నాడు.

కారుకి వున్న విండ్ స్క్రీన్స్ పూర్తిగా దించి సీట్లో వెనక్కి వాలి మేనకా హోటలువైపు చూడసాగాడు.

ఎవరో కుర్రవాడు హోటలు ఆవరణలోకి పరుగెత్తుతున్నాడు. అతడిని రాచుకుంటూ ఎవరో స్త్రీ బయటికి వస్తోంది. శిరీష్ వెనక్కి తిరిగాడు. తెరల వెనక సత్యవతి కూర్చుండి వుంది.

"ఆమె వనజ!" అంది సత్యవతి.

వనజ కంగారుగా పరుగెత్తుకుంటూ వచ్చి సిటీ బస్సు గ్రాపులో నిలబడి వుంది.

"ఆమె పరాంకుశం గదికి వచ్చింది. అతడు లేకపోవటంతో తిరిగి వెనక్కి వచ్చింది" అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

"మీ వూహ నిజమయింది. తన ఫోన్ని రాంగ్ నెంబర్ అని క్రెడిల్ చేయడాన్నిబట్టి ఆమె పరాంకుశం గదికి వచ్చింది!"

శిరీష్ మాట ముగించకముందే పోస్ట్మాన్ హోటల్ మేనకా ఆవరణలోకి ప్రవేశించాడు.

వనజ నిలబడినచోట కారు ఆగింది. శిరీష్ పరిశీలనగా కారులోకి చూశాడు. పరాంకుశం ఒక్కడే వున్నాడు కారులో. డ్రయివింగ్ సీట్లో కూర్చున్నాడు. కారు కదిలింది.

కారును మెల్లగా వెనకనే పోనిచ్చాడు శిరీష్. యాభై అరవై గజాల దూరంలో పరాంకుశం కారు పరుగెత్తుతోంది.

కారు న్యూ కాలనీ దాటి మర్రిపాలెం పోయేరోడ్డు పట్టింది.

ముందు కారులోని వాళ్ళకి అనుమానం రాకుండా వెంబడించసాగాడు శిరీష్. ముందుపోయే కారుకీ తన కారుకీ మధ్య కొన్ని వాహనాలుండేలాగా జాగ్రత్త పడుతున్నాడు శిరీష్.

పరాంకుశం కారు కరాస పోయే రోడ్డులోకి మళ్ళింది. విమానం వస్తోన్న చప్పుడు వినిపించి శిరీష్ తన వాచీ చూసుకున్నాడు. మధ్యాహ్నం రెండూ పది అయింది.

ముందుపోయే కారు కరాస దాటి విమానాశ్రయానికి యివతలగా వున్న సిమెంట్ రోడ్డులోకి మళ్ళింది. విశాల మైన భవంతిముందు ఆగింది.

శిరీష్ తన కారును అవతల రోడ్లోనే ఆపాడు. సత్యవతిని కార్లోనే కూర్చోమని చెప్పి చకచక నడుచు కుంటూ రోడ్డుప్రక్క నున్న గోతులు దాటి పొలానికి అడ్డం పడ్డాడు.

ఆ భవంతి వెనుకప్రక్కకి వచ్చాడు. తలెత్తి భవనం వైపు చూశాడు.

భవనం పైభాగంలో ఎంటెన్నా తగిలించి వుంది. పొడవుపాటి రాటకి చివర ఫోర్క్. పళ్ళులాగా పెద్ద గడులు ఏర్పడే కడ్డీల వరసగా నాలుగైదు తీగలు తగి లించివున్నాయి. రెండంతస్తుల భవనం అది.

'టెలివిజన్ వుంది!' గొణుక్కున్నాడు శిరీష్. భవంతి క్రింది అంతస్తువద్దకు నడిచాడు. నేలమీద కవర్ కని పించింది. చటుక్కున అందుకున్నాడు శిరీష్. పెన్సిలుతో తన అడ్రసు రాసివుంది. శిరీష్ నుదురు చిట్లించాడు. ఆ చేతిరాత తనకి చిరపరిచయం! సత్యనారాయణ చేతిరాత అది!

తల పైకెత్తి చూశాడు శిరీష్. ఈ కవర్ ఈ నేల మీద పడి ఎంతోసేపయి వుండదు. మట్టికూడా పెద్దగా అంటుకోలేదు.

కవర్ అంచులవైపు చూశాడు. అంచులవద్ద నలిగి వుంది. అంచు ఒత్తిడికి గురయినట్టుగా ఒంగి నలిగివుంది. అంటే ఈ ఉత్తరం పైగదిలోంచో అంతస్తులోంచో పడి వుంటుంది.

శిరీష్ పదడుగులు వెనక్కి నడిచి పైకి చూశాడు. అంత

పల కిటికీ గది తలుపులు తెరిచివున్నాయి. పైగది
క్కటే తలుపులు మూసివుంది.

కవర్ పడిన వైపుగా ఆ గదికొక్క కిటికీ వుంది.
కవర్ ఆ కిటికీలోంచే పడివుండాలి. శిరీష్ చటుక్కున
కవర్ తెరచి చూశాడు. చిన్నవుత్తరం వుంది. సత్య
నారాయణ రాసిన ఉత్తరం అది!

"విమానాశ్రయానికి దగ్గరలోనే వున్న ఇంట్లో
నన్ను బంధించారు. ఈ భవంతిలో టెలివిజన్
వుంది. ఎంటెన్నాను బట్టి ఈ భవంతిని సులువుగా
పట్టుకోగలరు.

—సత్యనారాయణ."

శిరీష్ పరుగుపరుగున పిట్టగోడ వద్దకు వచ్చాడు.

శిరీష్ పిట్టగోడమీద చేయివేసి లోపలకు గెంతాడు.
పైకి మెట్లు కనిపించాయి.

శిరీష్ సంకోచించకుండా మెట్లు ఎక్కి పైకివెళ్ళాడు.
రెండు అంతస్తులకీ అవే మెట్లు! పై అంతస్తులో అడుగు
పెట్టి కారిడార్‌లో అడుగుపెట్టాడు. పైగదికి వెళ్ళడానికి
చిన్న మెట్లు కనిపించాయి.

శిరీష్ మెట్లు ఎక్కేలోపుగా అతడిమీదకు ఎవరో
దూకారు. శిరీష్ చటుక్కున వొంగి ప్రక్కకి గెంతాడు.

పరాంకుశం చేతిలో కత్తి తళతళలాడింది. చటుక్కున
శిరీష్‌వైపు తిరిగి గెంతి పొడవబోయాడు.

శిరీష్ అతడిని ఒక్కతోపు త్రోసి పైకి పరుగెత్తాడు.
తలుపు బయట వున్న పనిమనిషిని ప్రక్కకి నెట్టి గడియ
తీశాడు. తలుపులు తెరుచుకున్నాడు.

అలజడికి నేను తలెత్తి చూశాను. శిరీష్‌ని కత్తితో
పొడుస్తున్నాడు పరాంకుశం. కత్తి శిరీష్ ఒంట్లో దిగక

ముందే అతడు తూలి క్రింద పడిపోయాడు. కెవ్వున అరిచాడు. అతడి చేతిలోని కత్తి అతడి పొట్టలో గుచ్చుకున్నది.

అప్పుడు కనిపించింది వనజ. నేను కదలడానికిలేదు. శరీఫ్ చకచక నన్ను సమీపించి కట్లు విప్పాడు.

వనజ పైమెట్టుమీదకు వచ్చింది. నేలమీద పడున్న పరాంకుశాన్ని చూచి 'కెవ్వు'న అరచుకుంటూ మెట్లమీదగా పరుగెత్తింది. కాళ్ళకు చీర అడ్డం పడినట్లయింది. తుళ్ళి క్రిందకు దొర్లిపోయింది.

నేను బయటకు వచ్చాను. సత్య నన్ను చూచి ఏడుస్తోంది.

శరీఫ్ ఆమెను సముదాయించాడు.

సత్య శరీఫ్ వైపు కృతజ్ఞతాపూర్వకంగా చూచింది. అంతలో ఇన్‌స్పెక్టర్ కుమార్ తన బలగంతో అక్కడికి వచ్చాడు. అతని చేతిలో ఓ టెలిగ్రాం వుంది.

శరీఫ్ సాలోచనగా టెలిగ్రాం చదివాడు.

"పరాంకుశం పబ్లికేషన్స్ భవంతిలో నలుగురు రచయితలు బంధించబడి వున్నారట. వాళ్ళను విడిపించి పరాంకుశం మీద కేసు ఫైలు చేస్తున్నారట మద్రాసు క్రైం బ్రాంచి వుద్యోగులు...."

"అంటే అయిదోవాడిని నేనన్నమాట! పబ్లికేషన్స్‌లో వెలువడే పుస్తకాలలోనే రాయడానికి బంధీని కాబోయేనన్న మాట!" అన్నాను. అందరమూ నిట్టూర్చాం.

—: ఐపోయింది :—